క్లుప్తంగా

పాఠశాలకు బీరువాల బహూకరణ



శాయంపేట : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు సోమవారం పూర్వ విద్యార్థులు రెండు బీరువాలను బహూకరించారు. పాఠశాలలో 1979–80లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్ రిజిస్టర్లు, డాక్యుమెంట్స్ భద్రపర్చడానికి రూ. 25వేల విలువ చేసే రెండు బీరువాలను సోమవారం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవికుమార్, వీరారెడ్డి, రాజేంద్రప్రసాద్, రాజేందర్, అశోక్, రమేష్, కోటి, భాస్కర్ పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతు



శాయంపేట : మండల కేంద్రంలోని ముస్లిం వీధిలో చెడిపోయిన చేతిపంపును సోమవారం పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ బోర్ మెకానిక్ బాసాని శ్రీనివాస్‌తో మరమ్మతు చేయించారు. విద్యుత్ అంతరాయాలతో, బోర్ మోటార్ల మరమ్మతులతో ఇటీవల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజల ఇబ్బందులను గమనించి పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ చేతిపంపును మరమ్మతు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధిగా రాజు



వేలేరు: బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధిగా మండలంలోని పీచర గ్రామానికి చెందిన మారబోయిన రాజును నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండలంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ ముఖ్య నాయకులకు, మాజీ ప్రజా ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దామెర : మండలంలోని కోగిల్వాయిలో పీడీఎస్ బియ్యం పట్టుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్ గ్రామానికి చెందిన గోనెల సదానందం తన ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కోగిల్వాయి పట్టుకున్నారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

అంబర్ ప్యాకెట్లు..

శాయంపేట : ప్రభుత్వ నిషేధిత అంబర్, ఆర్ఆర్ టుబాకో ప్యాకెట్లు తీసుకెళ్తున్న వారిని పట్టుకొని వాటిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని మాందారిపేట గ్రామంలో పోలీసులు సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు అనుమానితులు పోలీసులను గమనించి పారిపోతుండగా వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద 27 అంబర్ ప్యాకెట్లు, 13 ఆర్ఆర్ టుబాకో ప్యాకెట్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అంబర్ ప్యాకెట్లను తీసుకెళ్తున్న మాందారిపేటకు చెందిన ముక్క కృష్ణమూర్తి, మాల్యాల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత



నడికూడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవీ క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో సోమవారం 50 మంది విద్యార్థులకు రూ.5 వేల విలువ గల డిక్షనరీలు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు సరస్వతి విగ్రహాన్ని, మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు యిరుకుళ్ల శ్రీనివాస్, ట్రెజరర్ పబ్బతి నాగభూషణం, రీజనల్ చైర్మన్ మాధంశెట్టి సంపత్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో అసాంఘిక కార్యకలాపాలు

- దుర్వాసన భరించలేక పోతున్నామని ఉపాధ్యాయుల ఆవేదన
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్న ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల ఆవరణలో కండోమ్ ప్యాకెట్లు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తూ, బహిర్భూమికి వెళ్తూ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుస్తున్నారు. పాఠశాల పని వేళలు పూర్తయ్యాక ప్రాంగణంలో మంచినీటి ట్యాంక్ ఉండడంతో మల్టీపర్పస్ సిబ్బంది గేట్‌వాల్వ్ బంద్, ఓపెన్ చేయడానికి చిన్న గేటును తెరిచి ఉంచుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. దీన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలో రాత్రి వేళల్లో మద్యం సేవించి బీర్ సీసాలు పగలగొట్టి వేయడమే కాక, స్టాఫ్ రూమ్ వెనుక భాగంలో చెట్లలో బహిర్భూమికి వెళ్తున్నారు. ప్రాంగణంలో కండోమ్ ప్యాకెట్లు కూడా దర్శనం ఇస్తున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాల ప్రాంగణంలోకి ఎవరు రాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు సారయ్యను వివరణ కోరగా పాఠశాల సమయం ముగిశాక గేట్లకు తాళం వేసి వెళ్తున్నామని, వాటర్‌ట్యాంక్ నీళ్ల సరఫరా కోసం మల్టీపర్పస్ సిబ్బంది రావడానికి చిన్నగేటు తీసి ఉంచుతున్నట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు స్టాఫ్ రూంకు సమీపంలో బహిర్భూమికి వెళ్తుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నట్లు తెలిపారు. కిచెన్ షెడ్డులు టైల్స్ నిర్మాణం పూర్తికాకపోవడంతో తమకు అప్పగించలేదని సంబంధిత కాంట్రాక్టర్ కూడా ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇదే విషయమై మండల జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆకతాయిల నుంచి పాఠశాలను కాపాడాలని కోరారు.

రేవంత్‌రెడ్డి పాలనలోనే గ్రామాల్లో ప్రగతి విప్లవం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

నడికూడ: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలోనే గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగుతోందని అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పులిగిల్ల గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.15 లక్షలతో గ్రామంలో అంతర్గత సీసీరోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి వార్డులోనూ ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని, రాబోయే రోజుల్లో ప్రజల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ చేతన్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు దేవేందర్ రెడ్డి, మల్లారెడ్డి, మలహాల్ రావు, రమేష్, మోహన్‌రావు, సుభాష్‌రెడ్డి, రమణ రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

గుడి సెవాసులకు పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : ఇల్లులేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారికి ఇంటిపట్టాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని సీపీఐ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసె ప్రాంతంలో సోమవారం మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల కోసం దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీలన వర్గాలకు ఇళ్ల స్థలాలు లేక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి అశోక్, నాయకులు రమేష్, అంకుషావళి, కళావతి, రమాదేవి, రమేష్, మైనోద్దీన్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ధర్మసాగర్ : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ గోపీనాథ్




దామెర : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మసాగర్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో మొత్తం 54 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌మోహన్‌రావు, ఏఎన్ఎంలు విజయ, సుజాత, ప్రశాంతి, అరుణ, ఆశ వర్కర్లు లక్ష్మి, సునంద, స్వరూప వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాదెళ్లలో వైద్యశిబిరం

దామెర: ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి అన్నారు. సేవ పక్వాడ (సేవ పక్షం) కార్యక్రమంలో భాగంగా మండలంలోని ల్యాదెళ్లలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, డాక్టర్ కిషన్‌రావు, మొహమ్మద్ తహర్ మసూద్, జిల్లా నాయకులు గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు వేల్పుల రాజ్‌కుమార్, పిట్టల రమేష్, యాదగిరి రావు, బత్తుల సమంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



కేయూలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానిస్తున్న కుర్తా బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి సోమవారం వచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ కుర్తా బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, కోశాధికారి ప్రొఫెసర్ వీరన్ననాయక్, బాధ్యులు ప్రొఫెసర్ సీహెచ్.సమ్మయ్య, సుధాకర్, రిటైర్డ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల సేకరణ



చీరలను ట్రాక్టర్‌పై డీఆర్డీఓ కార్యాలయానికి తరలిస్తున్న దృశ్యం

శాయంపేట : ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో తుఫాన్ బీభత్సంతో నిరాశ్రయులైన వరద బాధితుల కోసం డీఆర్డీఏ అధికారుల ఆదేశాల మేరకు బతుకమ్మ చీరల సేకరణ చేపట్టారు. గత ప్రభుత్వం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. పంపిణీ చేయగా మిగిలి ఉన్న చీరలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు నిల్వ చేశారు. వరద బాధితులకు పంపిణీ చేయడానికి డీఆర్డీఏ అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఫణి చంద్ర గ్రామపంచాయతీలో నిల్వ ఉన్న చీరలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కార్యదర్శులు బతుకమ్మ చీరలను వాహనాల్లో తీసుకొని వచ్చి ఎంపీడీఓ ఆఫీసులో చేర్చారు. వీటన్నింటిని డీఆర్డీఓ అధికారులకు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

మండలస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలను నిర్వహించినట్లు మండల కార్యదర్శి గీత తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో క్రీడలు నిర్వహించగా 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి క్రీడాపోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీలత, మండల నోడల్ ఆఫీసర్ రమేష్, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు రజనీకాంత్, కమలాకర్, తరంగిణి, ధనపాల్, స్రవంతి, కావ్య, జ్యోతి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో దామెర విద్యార్థుల ప్రతిభ



దామెర: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్ కుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి లాంగ్ జంప్‌లో విభాగంలో ఎస్.రుతిక్ బంగారు పతకం, 5వ తరగతి చెందిన పి.రమ్య బ్రాడ్ జంప్ విభాగంలో రజత పతకం, 60 మీటర్ల రన్నింగ్ విభాగంలో 4వ తరగతికి చెందిన ఏ. అక్షయ సిల్వర్ మెడల్ సాధించింది. మెడల్స్ సాధించిన విద్యార్థును హెచ్ఎం, పీఈటీ దేవేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మల్లికాంబ, తదితరులు అభినందించారు.

మార్కెట్ బైలాను అమలు చేయాలి



మార్కెట్ కార్యదర్శికి మెమోరాండం అందజేస్తున్న నాయకులు

వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో బైలాను తూచా తప్పకుండా అమలు చేసి రైతుల పంటలను దోచుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం.. మార్కెట్ కార్యదర్శి పి.నిర్మలను సోమవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులు అష్టకష్టాలు పడి పండించిన పంటలకు రక్షణ కల్పిస్తూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, సంఘాల నాయకులు గోనె కుమారస్వామి, నర్ర ప్రతాప్, జగదీశ్వర్, ఇస్మాయిల్, నాగేష్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ డాక్టర్ ప్రహాషిత్

పరకాల: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకునేందుకు కావల్సిన సూచనలు ఇస్తూ వ్యక్తిగత వికాసంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సరైన నిర్ణయాలు తీసుకుంటూ వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించుకోవాలని సైకాలజిస్టు డాక్టర్ ప్రహాషిత్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ మెంటల్ హెల్త్ అవర్నేస్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.డీ సర్దార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బొడ్డెమ్మ సంబురాలు



దామెర : సంబురాలు జరుపుకుంటున్న ఐసీడీఎస్ సిబ్బంది



శాయంపేట: బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

దామెర: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బొడ్డెమ్మ సంబురాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకలో భాగంగా పుట్ట మట్టితో బొడ్డెమ్మను తయారు చేశారు. అనంతరం పసుపుతో గౌరమ్మను తయారుచేసి బొడ్డెమ్మ, బొడ్డెమ్మ కోల్ అంటూ పాటలు పాడారు. సూపర్‌వైజర్ జంగం రాణి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శారద, అంగన్‌వాడీ టీచర్లు సదిరం కోమల, మాదారపు రమ, బిల్లా వనజ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని 24 గ్రామాల్లో సోమవారం బొడ్డెమ్మ ఉత్సవాలను మహిళలు, చిన్నారులు వైభవంగా తయారు చేసి పసుపు కుంకుమ పుష్పాలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. కోలాటాలాడుతూ బొడ్డెమ్మ ఆటలు ఆడారు. మండలంలోని సూరంపేటలోని శ్రీ అభయాంజనేయ ఆలయంలో బొడ్డెమ్మ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

పొట్టిశ్రీరాములు పేరునే కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

కమలాపూర్: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు భూపతి రాజు, కొనిశెట్టి మునీందర్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలందరిని ఒక్క చోటుకు చేర్చాలనే లక్ష్యంతో తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనే పట్టుదలతో 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టిశ్రీరాములు పేరునే కొనసాగించడం సమంజ సమన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డిపై తమకు ఎలాంటి వ్యతిరేక భావన లేదని, ప్రతాపరెడ్డి పేరును నూతనంగా ఏర్పాటు చేసే మరో సంస్థకు పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులందరూ ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సాంబమూర్తి, ప్రవీణ్, శివకుమార్, యుగేందర్, నాగేశ్వర్‌రావు, జగదీశ్వర్, ఓంప్రకాష్, రమేష్, సాగర్‌బాబు, వీరభద్రయ్య, కృష్ణమూర్తి, సంపత్, వేణు, రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



రాజును సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూరు : పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ ఎన్నిక సోమవారం ఎంపీడీఓ విమల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా రాయికంటి రాజు, ఉపాధ్యక్షుడిగా కొచ్చర్ల సృజన, కోశాధికారిగా పెద్దిరెడ్డి జితేందర్ రెడ్డి, కార్యదర్శిగా అన్న అనూష, సహాయ కార్యదర్శిగా చల్లా సంధ్యా, కార్యనిర్వాహణ కార్యదర్శిగా కొత్తపల్లి లావణ్య, కార్యవర్గ సభ్యులుగా నాగెల్లి సంపూర్ణ, మంద శ్వేత, పెరుకారి క్రాంతి, జిందం రవికుమార్, వాసం అరుణ, చిర్ర కల్యాణి, పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి, పలకాల అమిత, మొగిలిచర్ల సునీల్‌కుమార్, కోగిల సతీష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు రాజును శాలువాతో సత్కరించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నయీంనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న టెక్నో విస్టా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీయూ కులపతి సీహెచ్‌వి.పురుషోత్తం రెడ్డి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పశువులపాలవుతున్న పచ్చదనం



పరకాల పట్టణంలో కూరగాయల వ్యాపారస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా అమరధామంలోని పచ్చదనమంతా పశువుల పాలవుతోంది. పదులకొద్ది పశువులు అమరధామంలోకి దూసుకెళ్లి పచ్చని మొక్కలను మేస్తున్నాయి. అమరధామం ప్రారంభ సమయంలో ఉన్న పచ్చదనమంతా కనుమరుగై పర్యాటకులను ఆకట్టుకోలేకపోతుంది.

– పరకాల

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : కె. నర్సింహా, పరకాల మున్సిపల్ కమిషనర్
ఫోన్‌నంబర్: 79933 61942